పేద పిల్లలకు అత్యుత్తమ విద్య



విద్యార్థినికి ట్యాబ్‌ను అందజేస్తున్న ఎంపీ ఆదాల చిత్రంలో మేయర్ స్రవంతి



కార్యక్రమానికి హాజరైన విద్యార్థినులు

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి
- కేఎన్నార్ విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

నెల్లూరు రూరల్ : పేద పిల్లలకు అత్యుత్తమ విద్యను అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని నెల్లూరు ఎంపీ, రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నగరంలోని బీవీనగర్‌లో ఉన్న కేఎన్నార్ స్కూల్‌లో విద్యార్థినులకు బుధవారం ఆయన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్ కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను పేద, మధ్య తరగతి విద్యార్థులకు అందిస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా బాల బాలికలకు అవసరమైన పుస్తకాలు, యూనిఫాం, షూస్, నోట్ బుక్స్‌ను అందించినట్లు వివరించారు. ట్యాబ్‌ల పంపిణీ వల్ల పేదలకు డిజిటల్ విద్య చేరువైందని, ఇది విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు నాంది అని తెలిపారు. బైజూస్ కంటెంట్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ స్రవంతి జయవర్ధన్, విజయా డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, 22వ డివిజన్ కార్పొరేటర్ మూలే విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరీ, రైల్వే బోర్డు మెంబర్ స్వర్ణా వెంకయ్య, ఏఎంసీ చైర్మన్ పేర్నాటి కోటేశ్వరరెడ్డి, మర్రిపాడు జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి, పాఠశాల హెచ్‌ఎం విజయ ప్రకాష్, క్లస్టర్ అధ్యక్షుడు పాతపాటి పుల్లారెడ్డి, స్థానిక డివిజన్ నాయకులు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట) : జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు సంబంధించి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ చాంబర్‌లో జర్నలిస్టుల హౌసింగ్ కమిటీ మూడో సమావేశం కలెక్టర్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపునకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న దృష్ట్యా ఆర్డీఓలు ప్రత్యేక శ్రద్ధ వహించి భూముల ఎంపిక చేయాలన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, మస్తాన్‌రెడ్డి, మురళి, ఆర్డీఓలు మాలోల, శీనానాయక్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి సదారావు పాల్గొన్నారు.

కొత్తూరులో న్యాయవిజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాణి

నెల్లూరు రూరల్ : నగర శివారు కొత్తూరులోని బేతల్ హోమ్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వీధి బాలల దినోత్సవం సందర్భంగా బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి మాట్లాడుతూ వీధి బాలలను గుర్తించి వారికి మంచి చదువులు అందించడం ప్రధాన కర్తవ్యమని, ఇందులో చైల్డ్ వెల్ఫేర్ శాఖ వారు ఎంతో బాగా పనిచేయాలన్నారు. బాలల హక్కుల విషయంలో ఉచిత న్యాయ సాయం అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వెంకయ్యనాయుడును కలిసిన బీజేపీ నేతలు



నెల్లూరు(మినీబైపాస్) : భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుకు కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్‌ను ప్రకటించడం హర్షణీయమని బీజేపీ ఏపీ మోర్చాల ఇన్‌చార్జి పి.సురేంద్రరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని నివాసంలో వెంకయ్యనాయుడును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి పి.సురేంద్రరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ నేతలు కుడుముల సుధాకర్‌రెడ్డి, కంచి పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కల్లూరుపల్లి హైస్కూల్‌లో వివాదం

నెల్లూరు రూరల్ : రూరల్ పరిధిలోని కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డులో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దాడి ఘటనపై బుధవారం వివాదం నెలకొంది. దీనిపై స్కూల్ హెచ్‌ఎం జ్యోతికుమారిని వివరణ కోరగా తనపై కొందరు పేరెంట్స్ దాడికి పాల్పడినట్లు తెలిపారు. స్కూల్లోని ఓ ఉపాధ్యాయుడు రెండు నెలల క్రితం ట్యూబ్‌లైట్‌లను తీసుకెళ్తుండగా తాను పట్టుకున్నానని, ఈ విషయంపై పోలీస్, విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. కాగా మరో వర్గం వారు మాట్లాడుతూ నాడు–నేడు పనులపై చర్చించేందుకు వెళ్లగా సమాధానం చెప్పకుండా పడిపోయారని తాము దాడి చేయలేదని చెప్పారు. దీనిపై రూరల్ సీఐ సుబ్బారావు మాట్లాడుతూ తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

ఎంపీ ఆదాలకు సత్కారం

నెల్లూరు రూరల్ : మెప్మా ఆర్పీల అసోసియేషన్ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షురాలు బి.సరళ ఆధ్వర్యంలో పలువురు ఆర్పీలు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఆయన నివాసంలో బుధవారం కలిశారు. అనంతరం కేక్ కట్ చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్పీలు షాహిదా, భవానీ, కమలకుమారి, ప్రసన్న, రమ, మెహతాజ్, భారతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్ అదుపుతప్పి పడడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కాకుటూరు వద్ద బుధవారం జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన రాజేష్ పని నిమిత్తం బైక్‌పై గూడూరుకు వెళ్తుండగా, కాకుటూరు సమీపంలో ఆటో అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో రాజేష్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా గంధ మహోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని రేబాల గ్రామంలో హజరత్ ఖాదర్‌వలి దర్గా వద్ద గంధ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ముస్లిం మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 సంవత్సరాల నుంచి గంధ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుల మతాలకు అతీతంగా గంధ మహోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సయ్యద్ బాషా, మల్లికార్జున, మాహబాషా, ఖలీల్, ఖాదర్‌బాషా, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం

మనుబోలు : రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారం అవుతున్నాయని తహసీల్దార్ శివకృష్ణయ్య అన్నారు. మండలంలోని జట్లకొండూరు గ్రామంలో రీసర్వేపై బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సర్వే పూర్తయ్యాక రైతుల పేరు మీద పట్టాలు అందజేస్తామని తెలిపారు. ఎంతో కాలంగా ఉన్న సమస్యలు రీసర్వేతో పరిష్కారమవుతాయన్నారు. ఉపసర్పంచ్ ఆవుల తులసీరామ్ మాట్లాడుతూ తమ పంచాయతీ పరిధిలోని కుడితిపల్లి గ్రామం సోత్రికం(ఇనాం) భూములు కావడంతో రైతులు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతుండేవారని తెలిపారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో దీనిని అసైన్‌మెంట్ భూములుగా మార్పు చేశారని వివరించారు. కార్యక్రమంలో సర్వేయర్‌లు శ్రీనివాస్, రాజా, వీఆర్వో అఖిల్, వైఎస్సార్‌సీపీ జిల్లాల సేవాదళ్ కార్యదర్శి గుంజి రమేష్, సచివాలయ కన్వీనర్ జగదీష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ

విడవలూరు : ఇటీవల అనారోగ్యంతో విడవలూరు ఎంపీపీ వేణుంబాక భవానమ్మ మృతిచెందగా, ఆమె కుటుంబాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ బుధవారం పరామర్శించారు. విడవలూరు మండల కేంద్రంలోని మన్మధరావుపేటలో ఉన్న ఆమె నివాసానికి వెళ్లి ప్రగాఢ సానుభూతి తెలిపారు. భవానమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈమె వెంట ఎంపీడీఓ జి.శ్రీనివాసరావు ఉన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



అంగన్‌వాడీలకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట) : అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని మేకపాటి క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి నూతనంగా ఉద్యోగాలు పొందిన ఒక అంగన్‌వాడీ కార్యకర్త, తొమ్మిది మంది సహాయకులకు నియామక పత్రాలను విక్రమ్‌రెడ్డి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్య బాధ్యతను మీకు అప్పగిస్తున్నారని, క్రమం తప్పకుండా వారికి సూచనలు, సలహాలు అందించడంతో పాటు పౌష్టికాహారం అందజేసే విధంగా చూడాలని వివరించారు. ప్రతి చిన్నారికి అవసరమైన విద్యాబుద్ధులు నేర్పించాలని, వారిని పాఠశాలల్లో చేర్పే విధంగా బాధ్యతలు తీసుకోవాలని తెలిపారు. ఏదైనా సాయం అవసరమైతే అడగాలని, చిన్నారులు, బాలింతలు, గర్భిణుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఐసీడీఎస్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

కవి పెరుగు రామకృష్ణకు పురస్కారం

నెల్లూరు(బృందావనం) : అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నగరానికి చెందిన కవి డాక్టర్ పెరుగు రామకృష్ణ 'ప్లేటో' అంతర్జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. ఆయన బుధవారం తెలిపిన వివరాల మేరకు.. యూరప్‌కు చెందిన 'ది ఇంటర్నేషనల్ చాంబర్ ఆఫ్ రైటర్స్ ఆర్టిస్ట్స్' వారు ఈ ఏడాది 'ప్లేటో' పేరున తొలి అంతర్జాతీయ పురస్కారం అందించారని, దీనిని ఇంటర్నెట్ ద్వారా బుధవారం ప్రదానం చేశారన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



నెల్లూరు (పొగతోట) : ఆల్ ఆంధ్రప్రదేశ్ నాలుగో తరగతి ఉద్యోగుల అసోసియేషన్ టేబుల్ క్యాలెండర్‌ను నగరంలోని ఏపీఎన్‌జీవోస్ అసోసియేషన్ భవనంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మన్నేపల్లి పెంచలరావు, నాయుడు వెంకటస్వామి బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కోశాధికారి బి.వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.ఆంజనేయవర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి ఈ.విజయకుమార్, నాలుగో తరగతి ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సందీప్ చక్రవర్తి, కార్యదర్శి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



నెల్లూరు(బారకాసు) : రూరల్ నియోజకవర్గం అల్లీపురం పరిధిలో 340 మందికి ఆరోగ్యశ్రీ కార్డులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేత జయవర్ధన్ మాట్లాడుతూ గతంలో రూ.5 లక్షల వరకు ఉన్న ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఆరోగ్య భద్రత కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు నెల్లూరు పవన్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మురళీరెడ్డి, విశ్వనాథ్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నగర కమిటీ నియామకం



నగర కమిటీ అధ్యక్షుడు పెంచలరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట) : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నెల్లూరు నగర పార్టీ కమిటీని బుధవారం నియమించారు. నగర కమిటీ అధ్యక్షుడిగా సన్నపురెడ్డి పెంచలరెడ్డి, ఉపాధ్యక్షులుగా వేలూరు శ్రీధర్‌రెడ్డి, ఖజానా వెంకటశేషయ్య, జనరల్ సెక్రటరీలుగా తంబి శ్రీనివాసులు, కువ్వకొల్లు బాబ్జి, సూరిశెట్టి ఉమాసురేంద్ర, ఉప్పల శేషు, ట్రెజరర్‌గా మంగు భాస్కర్‌రావు, సెక్రటరీగా పామూరు విజయభాస్కర్‌రెడ్డి, పచ్చా రవి, సిద్దు రమణారెడ్డి, మహ్మద్‌సుభాని, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కావలి వెంకట రాజీవ్, సిద్ధం వెంకటేష్, ఉదయగిరి జ్యోతిప్రభ, వి.శశికళ, మల్లెల ఓబుల్‌రెడ్డి, ఎస్.భానుప్రకాష్‌రెడ్డి, తుపాకుల శాంతి, కానసాని సుజాత, షేక్ అజోఅహ్మద్, సన్ను పెంచలయ్య, అరవ ప్రమీల, షేక్ షంషాద్, చేవూరు హేమచంద్రారెడ్డి, కోట శ్రీనివాసులు, ఆవుల సుప్రియ, జ్యోతిప్రియలను నియమించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మట్లాడుతున్న విఠపు బాలసుబ్రహ్మణ్యం

నెల్లూరు(దర్గామిట్ట) : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపులో భాగంగా నెల్లూరు కలెక్టరేట్ వద్ద బుధవారం తలపెట్టిన రిలే నిరాహార దీక్షకు విఠపు మద్దతు తెలిపారు. ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకుందామని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు నవకోటేశ్వరావు, పి.బాబురెడ్డి, వీవీ శేషులు, జీవీ చలపతిశర్మ తదితరులు పాల్గొన్నారు.

'రంగడి' సన్నిధిలో వేలంపాటలు



వేలంపాట నిర్వహిస్తున్న ఈఓ, ధర్మకర్తల మండలి సభ్యులు

నెల్లూరు(బృందావనం) : రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో 2024–25 సంవత్సరంలో తాత్కాలిక లీజు హక్కులకు బహిరంగ వేలంపాటలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ ఏడాది కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాలు, ఫొటోలు, పుస్తకాల విక్రయం, పాదరక్షల స్టాండ్, దేవస్థానం కల్యాణ మండపంలో వివాహాది కార్యాలకు లైటింగ్ డెకరేషన్, హైరర్స్ సప్‌లై స్టేజీ పూల డెకరేషన్, భక్తులు సమర్పించే వస్త్రాలను సేకరించుకునే హక్కులకు వేలంపాటలు జరిపామన్నారు. ఇందులో దేవస్థానానికి రూ.10,62,000 ఆదాయం వచ్చిందన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది రూ.1,93,000 ఆదాయం పెరిగిందన్నారు. కాగా కొబ్బరి చిప్పలు సేకరించుకునే హక్కును వాయిదా వేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, సభ్యులు అడపా లక్ష్మి, వీరేపల్లి పద్మజ పాల్గొన్నారు. పరిశీలకులుగా దేవస్థానం ఇన్‌స్పెక్టర్ ఎం.సుధీర్ వ్యవహరించారు.

రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లూరు రూరల్ : రూరల్ పరిధిలోని కల్లూరుపల్లి ఇందిరమ్మ కాలనీలో ధార్మిక పరిషత్ ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా రాజరాజేశ్వరి అమ్మవారి విగ్రహాన్ని కొలువుదీర్చి బుధవారం విశేష పూజలు నిర్వహించారు. తొలుత విశేష కుంకుమార్చన, లలితా సహస్రనామ పూజలు, కుంభ హారతులు భక్తిశ్రద్ధలతో జరిపారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కోలాట ప్రదర్శన చేశారు. భక్తిగీతాలను ఆలపించారు. ఆలయ ప్రధానార్చకుడు రఘురామ్‌శర్మ, వేద పారాయణదారుడు రామకృష్ణశర్మ, ధర్మకర్తగా భారతి వ్యవహరించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

నెల్లూరు (టౌన్) : బాల్య వివాహాలను పూర్తి స్థాయిలో అరికట్టాలని పలువురు అధికారులు, నాయకులు అన్నారు. నగరంలోని వెంగళరావునగర్‌లో ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో ప్రజాసత్తా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పులగర శోభన్‌బాబు అధ్యక్షతన బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న అధికారులు, నాయకులు మాట్లాడుతూ బాలికలు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల్లో స్థిరపడి అభివృద్ధి చెందాలని తెలిపారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, తద్వారా మానసికంగా, శారీరకంగా, ఆరోగ్య పరంగా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే పోలీసులు లేదా అధికారులకు తెలియజేయాలని సూచించారు. బాలికల చదువు ఆవశ్యకత, బాల్య వివాహాలు జరిగితే నష్టాల పట్ల అవగాహనకు పలు పాటలు పాడి, ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డాక్టర్ పి.రీనాకుమారి, జి.మాధవరావు, జిల్లా బాలల సంరక్షణాధికారి సుజాత, 32వ డివిజన్ కార్పొరేటర్ తాళ్లూరు అవినాష్, డివిజన్ ఇన్‌చార్జిలు బెజవాడ మేఘనాథ్ సింగ్, అలగర ప్రభాకర్, క్రిస్టియన్ సెల్ కార్యదర్శి డి.రాజేష్, ప్రజాసత్తా రాష్ట్ర కార్యదర్శి దువ్వూరు ప్రసాద్ మాట్లాడారు. 35, 41 డివిజన్ కార్పొరేటర్లు వై.శరత్ చంద్ర, బాబ్జియాదవ్, ప్రజాసత్తా ఎస్సీ సెల్ కార్యదర్శి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసరాతో ఆర్థికాభివృద్ధి



సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న మేయర్ స్రవంతి, ఎంపీ ఆదాల



ఆసరా కార్యక్రమానికి హాజరైన మహిళలు

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి
- ఘనంగా వైఎస్సార్ ఆసరా సంబరాలు

నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ ఆసరాతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నట్లు నెల్లూరు ఎంపీ, రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని మినీ బైపాస్‌రోడ్డులో ఉన్న మహేశ్వరి పరమేశ్వరి కల్యాణ మండపంలో వైఎస్సార్ ఆసరా సంబరాలు బుధవారం పండగ వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతున్నట్లు వివరించారు. రూరల్ పరిధిలో తాను 80 శాతం మేరకు రోడ్లను అభివృద్ధి చేశానని గుర్తుచేశారు. అభివృద్ధి, సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు.

సంక్షేమ పాలనకు ఓటేద్దాం – మేయర్ స్రవంతి

వచ్చే ఎన్నికల్లో సంక్షేమ పాలనకు ఓటేసి, జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకుందామని మేయర్ పొట్లూరి స్రవంతి అన్నారు. మహిళలకు ఆర్థికంగా చేయూతనిచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ, అమ్మ ఒడి తదితర సంక్షేమ పథకాలను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మహిళలకు అన్నిరంగాల్లో సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు.

మంచి జరిగితేనే ఆశీర్వదించండి– మొయిళ్ల గౌరి

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేద కుటుంబానికి మంచి చేశారని, ఆర్థికంగా ఆదుకుని పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఆర్థిక వెలుగులు నింపారని కార్పొరేటర్ మొయిళ్ల గౌరి అన్నారు. మేలు జరిగితేనే ఓటు వేయండి అని అడిగే ధైర్యం గతంలో ఏ ముఖ్యమంత్రులు చేయలేదని గుర్తుచేశారు. ప్రతి కుటుంబం ఒకసారి ఆలోచించి ఎవరి హయాంలో మేలు జరిగిందో చూసుకుని ఓటు వేయాలని కోరారు.

మహిళా సాధికారతే.. జగన్ లక్ష్యం

మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం జగన్ పాలన సాగుతోందని డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రతిపక్షాల విమర్శలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. అనంతరం రూరల్ మండలంలోని 6,299 మంది డ్వాక్రా మహిళలకు మంజూరైన రూ.5.65 కోట్ల మెగా నమూనా చెక్కును ఎంపీ ఆదాల మహిళలకు అందజేశారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నగర దివ్యాంగుల అధ్యక్షుడు రింగ్ రియాజ్, పార్టీ జిల్లా యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, పార్టీ నేతలు పద్మజా యాదవ్, శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి, సుబ్బారెడ్డి, కార్పొరేటర్లు శ్రీనివాసులురెడ్డి, అశోక్‌కుమార్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నీటి లీకేజీ సమస్యకు పరిష్కారం



నీటి లీకేజీని అరికట్టేందుకు చేపడుతున్న పనులను పర్యవేక్షిస్తున్న మేఘనాథ్‌సింగ్

నెల్లూరు(బారకాసు) : చాలా ఏళ్లుగా 33వ డివిజన్ సీబ్లాక్ ప్రాంతంలో నెలకొన్న నీటి లీకేజీ సమస్యకు పరిష్కారం లభించింది. నెల్లూరు ఎంపీ, రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి చొరవతో విజయా డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి సూచనల మేరకు డివిజన్‌లో నెలకొన్న నీటి లీకేజీ సమస్యకు పరిష్కారం లభించిందని 33వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేఘనాథ్‌సింగ్ తెలిపారు. స్థానిక డివిజన్ పరిధిలోని సీబ్లాక్ ప్రాంతంలో నీటి లీకేజీని అరికట్టేందుకు బుధవారం యంత్రాన్ని తీసుకొచ్చి పనులు చేపట్టినట్లు వివరించారు. అంతేకాకుండా డివిజన్‌లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారం దిశగా ముందుకు వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు అశోక్‌దాస్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్, చందు, వెంకటేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.